లక్ష్మీనరసింహుడికి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, ఆగస్టు 14: ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 14,77,655 ఆదాయం

సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి

ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 14 : ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. వీఐపీ వెంచర్‌లో అమృత్ స్కీం కింద నిర్మించనున్న ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 26 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్లో కల్పనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ స్టూడెంట్‌కు వెండి పతకాల బహూకరణ, జూలూరు జడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ, ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మ నుంచి 16 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ వేస్తే పోచంపల్లికి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. పోచంపల్లి పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. సీఎస్ఆర్ ఫండ్స్‌తో నియోజవర్గంలో 60 వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో వలిగొండకు 11, పోచంపల్లి మండలానికి 23 కేటాయించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అయితే అధికారులతో నిర్వహించిన సమావేశానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ కూడా హాజరవడంతో ఆశ్చర్యపోవడం అధికారుల వంతైంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాతుక లింగస్వామి, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, కమిషనర్ వీరారెడ్డి, ఎంపీఓ మజీద్, కౌన్సిలర్లు గుండుమధు, సామల మల్లారెడ్డి, కర్నాటి రవీందర్, భానుమతి, మోటె రజిత, అధికారులు. నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 14 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, రాపిడ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇంటింటి జ్వర సర్వే చేపట్టి జ్వరం కేసుల పట్ల వైద్య సాయం అందించాలన్నారు. నీటి నిల్వలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయాలని, నీటి గుంతలను పూడ్చివేయాలని, దోమ లార్వాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌కు పెట్టిన గండిని పూడ్చాలి : సీపీఎం

చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, ఆగస్టు 14 : మండలంలోని మగ్దూంపల్లి గ్రామంలో బునాదిగాని కాల్వపై ఉన్న చెక్‌డ్యామ్‌కు అక్రమంగా పెట్టిన గండిని పూడ్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నమాత్‌పల్లి, అనాజిపురం గ్రామాల్లోని బునాదిగాని కాల్వ, మగ్దూంపల్లి వద్ద చెక్ డ్యామ్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వకు మరమ్మతులు చేయక పోవడంతో కాల్వలో చెత్త పేరుకు పోయిందని, గుర్రపు డెక్క ఆకు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారిందని పేర్కొన్నారు. మగ్దూంపల్లి వద్ద చెక్ డ్యామ్‌కు కొందరు అక్రమంగా గండి పెట్టడంతో నీళ్లన్నీ వృథాగా చిన్నేరు వాగులోకి పోతున్నాయని తెలిపారు. దాంతో నందనం, నమాత్‌పల్లి, ఎర్రంబల్లి, పైల్వాన్‌పురం చెరువుల్లోకి నీళ్లు చేరే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గండి పూడ్చి కాల్వ కింద ఉన్న చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. వారి వెంట సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు ఏదునూరి మల్లేశం, జిట్టా అంజిరెడ్డి, సురుపంగ ప్రకాశ్, తోటకూరి మల్లేశం, అయితరాజు కిష్టయ్య, భీమనబోయిన ముత్యం, ప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

రాజాపేట, ఆగస్టు 14 : విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని బొందుగుల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మైలారం శ్రీనివాస్‌రెడ్డి పొలంలో ఉన్న బోరులోంచి మోటరు, పైపులు వెలికి తీస్తున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలకు పైపులు తగలడంతో తరిగొప్పుల కరుణాకర్, ఉప్పరి సిద్దులు విద్యుదాఘాతానికి గురైయ్యారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. ఉప్పరి సిద్దులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం

ఎంపీఓ కిషన్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ ఇందిర, గ్రామపంచాయతీ కార్యదర్శులు

మోటకొండూర్, ఆగస్టు 14: మోటకొండూర్ ఎంపీఓ కిషన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోఫియా, ప్రత్యూష, మల్లేశ్, అశోక్ వేరే మండలానికి బదిలీ అయ్యారు. బుధవారం వారిని ఎంపీడీఓ ఇందిర, గ్రామపంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని రైతువేదికలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులుగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఎంపీవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మోత్కూరు, ఆగస్టు 14: మోత్కూరు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల పక్షం నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా ప్రధాన రోడ్డుపై బైక్‌లు, కార్లు నిలుపుతుండడంతో రోడ్డుపై వెళ్తున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మాంసం, చికెన్ షెల్టర్ హౌస్‌లను పట్టణం శివారులో ఏర్పాటు చేయాలని, జనావాసాల మధ్య ఫామ్‌హౌస్‌లను ఏర్పాటు చేయడం, అక్కడే పశువులను ఉంచడంతో దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌లు, మాంసం, చికెన్ షాపులను జనావాసాల మధ్య ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, బయ్యాని రాజు, మరాఠి అంజయ్య, దామరోజు సత్యనారాయణచారి, గుండగోని రామచంద్రుగౌడ్, గడ్డం నర్సింహ, బొల్లు యాదగిరి, అన్నెపు వెంకట్, మల్లేశం పాల్గొన్నారు.

రాజాపేట మండల వైద్యాధికారిగా భరత్‌కుమార్

భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజాపేట, ఆగస్టు 14 : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ భరత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వైద్యాధికారి భరత్‌కుమార్‌ను రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు గౌటె లక్ష్మణ్, నాయకులు గుర్రం స్వామి, గుర్రం శ్రవణ్ శాలువాతో సన్మానించారు.

సింగారం మాజీ సర్పంచ్ మృతి

- నివాళులర్పించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాజాపేట, ఆగస్టు 14 : మండలంలోని సింగారం గ్రామ మాజీ సర్పంచ్ వంపు బాలలింగయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గ్రామానికి వెళ్లి బాలలింగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నెమిలె మహేందర్‌గౌడ్, నాయకులు మసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇంజ నరేశ్, బుడిగె పెంటయ్యగౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ నీటిని విడుదల చేయాలని వినతి

డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు14 : బునాదిగాని కాల్వ ద్వారా మండలానికి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ పలువురు రైతులు బుధవారం డిప్యూటీ తాసీల్దార్ ఎస్‌డీ షఫియొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్‌రాజు, రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బునాదిగాని కాల్వ ద్వారా నీటిని విడుదల చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయని, బోర్లు, బావుల కింద సాగు నీరందడంతో రైతులు ఇబ్బందులు లేకుండా సాగు చేసుకున్నారన్నారు. ఈ సంవత్సరం వర్షాలు లేక కుంటలు, చెరువులు ఎండిపోవడంతో భూ గర్భజలాలు పూర్తి స్థాయిలో పడిపోయి రైతులు సాగు చేసిన పంటలు సైతం ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే బునాదిగాని కాల్వ ద్వారా మూసీ నీటిని గానీ, గోదావరి జలాలను గానీ విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సత్తిరెడ్డి, హరిచంద్ర, సత్యనారాయణ, శ్రీశైలం, చంద్ర య్య, ఉప్పలయ్య, యాదగిరి, చంద్రమౌళి, మల్లేశం ఉన్నారు.

యాదగిరిగుట్ట పట్టణంలో విద్యుత్ లైన్ పునరుద్ధరణ

విద్యుత్ తీగలను సరి చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట, ఆగస్టు14 : యాదగిరిగుట్ట పట్టణంలోని 12 వార్డులో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండడం, చెట్ల కొమ్మలకు తగులుతూ ప్రమాదకరంగా మారడంతో విషయాన్ని వార్డు కౌన్సిలర్ బబ్బూరి మౌనిక ట్రాన్స్‌కో ఏఈ సురేంద్రనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఏఈ బుధవారం సిబ్బంది సాయంతో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేశారు. చెట్ల కొమ్మలను తొలగించి తీగలను పునరుద్ధరించారు. సమస్యను పరిష్కరించిన ఏఈకి వార్డు కౌన్సిలర్, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బొల్లేపల్లి పీహెచ్‌సీలో హెల్త్ మేళా

హెల్త్‌కార్డులను పంపిణీ చేసిన వైద్యాధికారులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 14 : మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిల్పిని ఆధ్వర్యంలో హెల్త్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించనున్న వైద్య సేవలను డాక్టర్ శిల్పిని వివరించారు. త్వరలోనే పీహెచ్‌సీల్లో అన్ని రకాల స్పెషలిస్ట్ సేవలు అందుతాయని తెలిపారు. అనంతరం పలువురికి ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. పలు వ్యాధులు రావడానికి కారణాలు అవి రాకుండా పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఉప వైద్యాధికారి డాక్టర్ యామిని, స్థానిక హెల్త్ అసిస్టెంట్లు వినోద, భాగ్య పాల్గొన్నారు.

మహదేవ్‌పూర్ ఆలయ ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్

బీబీనగర్, ఆగస్టు 14 : మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారి చేసినట్లు ఆలయ మేనేజర్ రుద్ర వెంకటేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను నల్లగొండలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధులపై బుధవారం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తెలుగు వారిని స్మరించుకునేందుకు ఇదొక చక్కని వేదికన్నారు. ఈ ప్రదర్శనలో రాంజీ గోండు, కుమురం భీం, చిట్యాల ఐలమ్మ, స్వామీ రామానంద తీర్థ, తుర్రెబాజ్ ఖాన్, రావి నారాణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి వంటి పోరాట యోధులను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి

మాట్లాడుతున్న రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి

వలిగొండ, ఆగస్టు 14 : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రకజక కులస్తులను ఎస్సీల జాబితాలో చేర్చే విధంగా శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. సమావేశంలో రజక సంఘం నాయకులు జూపల్లి నాగేశ్, బండిరాల సుశీల, ఎలిమినేటి వెంకటేశం, మైసోళ్ల మత్స్యగిరి, కేతూరి రవి, అక్కనపల్లి గణేశ్, యాదగిరి పాల్గొన్నారు.

చిన్నారుల తల్లులకు క్రీడా పోటీలు

క్రీడా పోటీల్లో పాల్గొన్న చిన్నారుల తల్లులు

రాజాపేట, ఆగస్టు 14 : మండలంలోని కుర్రారం అంగన్‌వాడీ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం చిన్నారుల తల్లులకు క్రీడా పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, రన్నింగ్, కప్పగంతుల పోటీల్లో పాల్గొనేందుకు తల్లులు ఆసక్తి కనబర్చారు. విజేతలకు గురువారం బహుమతులు అందించనున్నట్లు అంగన్‌వాడీ టీచర్ బూర్గు స్వప్న తెలిపారు.

డీఆర్‌డీఏ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ఉపేందర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు : డీఆర్‌డీఏ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్‌గా మందడి ఉపేందర్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు భగత్, కలెక్టరేట్ పరిపాలనా అధికారి జగన్, కార్యదర్శి ఖదీర్, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రమణ, డీఆర్‌డీఏ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

యువ చైతన్య కళా నిలయం కార్యవర్గం

యువ చైతన్య కళానిలయం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 14 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామ యువ చైతన్య కళానిలయం కార్యవర్గాన్ని బుధవారం మాజీ అధ్యక్షుడు మోడపు అశోక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈటమోని బలరాం, ఉపాధ్యక్షుడిగా దొరగండ్ల రవి, గౌరవాధ్యక్షులుగా ఈటమోని నరసింహ, పాండు, సిద్ధగోని పాండు, ఈటమోని నరేందర్, కుతాడి ప్రభాకర్, కార్యదర్శిగా ఈటమోని శ్రీను, సహాయ కార్యదర్శి సన్నా శ్రీశైలం, క్రీడల కార్యదర్శిగా మహేష్, కార్యవర్గ సభ్యులుగా కుతాడి సుధాకర్, ఈటమోని బాలయ్య, సిద్ధగోని భాస్కర్, లింగస్వామి, బాలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఏసీపీ

దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి

- ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 14 : దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఏసీపీ మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్‌హాల్లో సీవీఆర్ డిసిబిలిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నాటి స్వప్నా అనిల్ కుమారుడు ఇషాన్ రాజా సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ పాల్గొని 50 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.2వేల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తాసీల్దార్ కార్యాలయం నుంచి తంగడపల్లి రోడ్డు వరకు వీల్‌చైర్‌లతో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ, సిలివేరు శ్రీనివాస్, తండా మహేశ్, ఎర్ర వీరయ్య, బర్రె శంకర్, స్వామి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేస్తే డబ్బులు మాయం

సైబర్ క్రైం బారినపడి రూ.76వేలు పోగొట్టుకున్న బాధితులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 14 : తమ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు మాయమైన ఉదంతం బుధవారం వెలుగు చూసింది. రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాయగిరికి చెందిన శనిగల నర్సింగరావుకు గత నెల 17న ధని లోన్‌యాప్ ద్వారా లోన్ సులభంగా పొందవచ్చని గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. దానిని నమ్మిన ఆయన లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే నర్సింగ్‌రావు బ్యాంకు ఖాతా నుంచి రూ. 36వేలు వేరే వారికి బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. అదేవిధంగా మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన కొల్తూరి బాలరాజుకు జూలై 22న ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్ పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి రూ.40వేలు వేరేవారికి బదిలీ అయ్యాయి. వెంటనే తేరుకున్న బాధితులు 1930కు ఫిర్యాదు చేశారు. అనంతరం బుధవారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని ఎస్ఐ సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 14 : సమగ్ర శిక్ష, కేజీబీవీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులందరికి మినిమం టైం స్కేల్‌ను అందించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డు సదుపాయం కల్పించాలని, విద్యా శాఖలో చేపట్టి ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఉద్యోగులు శ్యామల, జ్యోతి, కృష్ణ బాలలక్ష్మి, నవ్య, కృష్ణవేణి, పావని, భవాని, వీణ ఉన్నారు.

దివీస్ సహకారంతో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చౌటుప్పల రూరల్,ఆగస్టు14 : మండలంలోని రెడ్డిబాయి గ్రామంలో రూ.9.70 లక్షలతో దివీస్ పరిశ్రమ వారు ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను తాసీల్దార్ హరికృష్ణ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ ధనలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ శ్యాంప్రసాద్, నాయకులు వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోడు వారిన వృక్షాలు చిగురించాయి

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 14 : మండలంలోని కప్రాయపల్లి – టీరేపాక గ్రామాల మధ్య ప్రధానరోడ్డు వెంట ఉన్న 150 ఏండ్ల నాటి బూరుగు చెట్టు, మండలంలోని కూరెళ్ల గ్రామంలో ఉన్న 160 ఏండ్ల నాటి వేప చెట్టుకు మేలో ఆకులు పూర్తిగా రాలిపోయి మోడుబారాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సదరు బూరుగు చెట్టు, వేప చెట్టు చిగురించి పచ్చదనంతో కళకళ లాడుతున్నాయి.

తిరంగా యాత్ర

రామన్నపేట, ఆగస్టు 14: బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మంగు నర్సింహరావు, మండలాధ్యక్షుడు కంబాలపల్లి సైదులు, బీజేపీ మండలాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, జంగిలి సత్యనారయణ, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి,ఆగస్టు14 : మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం బీఆర్ఎస్ నాయకుడు అన్నారం రాజు అందించారు. కార్యక్రమంలో రమ్ము నర్సింహులు, పుట్ట సాయిలు, మల్లేశ్, మహేశ్ పాల్గొన్నారు.